సాక్షి
తూర్పుగోదావరి
గురువారం । 15 । ఆగస్టు । 2024



సహస్ర కాంతుల కర్పూరం

రావులపాలెం అరటి మార్కెట్‌లో రైతులకు కర్పూరం రకం గెలల అమ్మకాలు లాభాలు తెచ్చిపెడుతున్నాయి.


II లో



అన్నదానానికి రూ.50 వేలు

గోకవరం: తంటికొండ వేంకన్న ఆలయంలో ప్రతి శనివారం నిర్వహించే అన్నదానానికి పులుపు త్రిమూర్తులు (నరసాపురం) రూ.50 వేలు విరాళం అందజేశారు.

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం సాయంత్రం 2,62,669 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 6.40 అడుగులకు చేరింది. ఖరీఫ్ సాగు కోసం డెల్టా కాలువలకు 12,350 క్యూసెక్కులు వదిలారు.

పెద్దాసుపత్రికి సుస్తీ

- **రాజమహేంద్రవరం సర్వజన ఆసుపత్రిలో పడకేసిన వైద్య సేవలు**
- **ప్రతి రోజూ 800లకు పైగా ఓపీ**
- **మూడు జిల్లాల నుంచి రోగుల రాక**
- రోగిని దగ్గర నుంచి చూసేందుకు సాహసించని వైద్యులు
- రేడియాలజీ, ఎక్స్‌రే వద్ద పడిగాపులు
- ల్యాబుల్లో వేధిస్తున్న వైద్యుల కొరత
- బోధనాస్పత్రిగా అభివృద్ధి చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- చిన్నపాటి వసతులు కల్పించలేని స్థితిలో కూటమి ప్రభుత్వం
- 'సాక్షి' ప్రత్యేక పరిశీలనలో వాస్తవాలు బహిర్గతం



సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రి

సాక్షి, రాజమహేంద్రవరం/కంబాలచెరువు/సీటీఆర్ఐ: ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఆరోగ్య ప్రదాయిని అనారోగ్యం బారిన పడింది. వైద్యుల కొరతతో సతమతం అవుతోంది. ఆస్పత్రికి వస్తున్న రోగులకు సరైన వసతులు కల్పించలేక కునారిల్లుతోంది. ఓపీ వైద్యం పొందాలన్నా.. మందులు తీసుకోవాలన్నా గంటల తరబడి నిరీక్షించాల్సిన దయనీయ పరిస్థితి నెలకొంది. ఎముకల విభాగంలో వైద్య సేవలు పొందడం.. ఎక్స్‌రే, సీటీ స్కాన్, ఎమ్మారై పరీక్షలు అగ్ని పరీక్షలుగా పరిణమించాయి. అత్యవసర, హైరిస్క్ గర్భిణులు, కిడ్నీ సంబంధిత కేసులను కాకినాడకు రిఫర్ చేస్తున్నారు. రోగులు పడుతున్న అవస్థలు.. వైద్యం అందుతున్న తీరు.. సమయంపై 'సాక్షి' బృందం ప్రత్యేక పరిశీలన చేపట్టింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిరంతరాయంగా 'సాక్షి' బృందం ఆస్పత్రిలో అన్ని విభాగాలు పరిశీలించింది. ఇందులో పలు ఆసక్తికర విషయాలు బహిర్గతమయ్యాయి.

అమ్మో ఆర్థో..

ఎముకల విభాగం(ఆర్థో) వద్ద రోగుల రద్దీ ఎక్కువగా కనిపించింది. వందల మంది రోగులు వేచి చూస్తున్న దృశ్యాలు దర్శనమిచ్చాయి. రోగులకు సరిపడా కుర్చీలు ఏర్పాటు చేయకపోవడంతో నిలుచునే ఉన్నారు. అనంతరం వైద్య సేవలు పొంది వెళ్లారు. మిగిలిన విభాగాల్లో ఎక్కువ రద్దీ కనిపించలేదు.

ఫార్మసీలో కొన్ని మందులే..

వైద్య సేవలు పొందిన అనంతరం వైద్యులు సూచించిన మందులు తీసుకునేందుకు రెండు కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఒకటి పురుషులు, మరోటి స్త్రీలకు కేటాయించారు. మందులు తీసుకోవాలంటే 2 నుంచి 3 గంటల పాటు నిరీక్షించాల్సిన పరిస్థితులు. రోగులు, బంధువులు కిక్కిరిసిపోయారు. వేచిచూసేందుకు సరైన వసతులు లేవు. కొన్ని మందులు మాత్రమే ఇస్తున్నారు. మిగిలినవి అందుబాటులో లేవని బయట తీసుకోవాలని ఉచిత సలహా ఇస్తున్నారు.

ఎవరి స్ట్రెచర్ వారిదే..!

అత్యవసర విభాగానికి (క్యాజువాలిటీ) అచేతనావస్థలో కదలలేని, స్పృహ కోల్పోయి, అపస్మారక స్థితిలో ఉన్న రోగులు వస్తుంటారు. అక్కడున్న వైద్య సిబ్బంది చేదోడుగా నిలిచేందుకు ప్రత్యేకంగా అత్యవసర విభాగం ఏర్పాటు చేశారు. అచేతనావస్థలో విభాగానికి వచ్చిన రోగులకు వైద్యం నిమిత్తం ఆస్పత్రి లోపలికి తీసుకెళ్లేందుకు స్ట్రెచర్, వీల్‌చైర్ అందుబాటులో ఉండటం లేదు. దీంతో రోగుల బంధువులే తమ చేతులపై వైద్య సేవలకు తీసుకెళ్లే పరిస్థితి దర్శనమిచ్చింది. కదలలేని స్థితిలో ఉన్న రోగిని తీసుకెళ్లేందుకు స్ట్రెచర్ బ్యారర్ ఉండాలి, కానీ ఇక్కడ అలాంటి వ్యక్తి ఒకరు ఉంటారన్న విషయమే ప్రజలకు తెలియదు. అత్యవసర విభాగానికి వచ్చే వ్యక్తిని రిసీవ్ చేసుకునేందుకు ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లను నియమించినా..వాళ్ల పని మానేసి ఇతర వ్యవహారాల్లో మునిగితేలుతున్నట్లు ఆరోపణలున్నాయి.

రక్త పరీక్షలు ఆలస్యమే!

రోగికి రక్త పరీక్షలు అత్యంత కీలకం. జీజీహెచ్‌లో ప్రతి రోజూ 2 వేలకు పైగా రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు. సిబ్బంది కొరతతో ఫలితాల వెల్లడి ఆలస్యమవుతోంది. దీంతో వైద్య సేవలు పొందేందుకు తీవ్ర ఇబ్బందులు నెలకొన్నట్లు రోగులు చెబుతున్నారు. థైరాయిడ్ పరీక్ష చేసిన మరుసటి రోజు ఫలితాలు రోగికి ఇస్తున్నారు.

నాడిపట్టని వైద్యులు

కొందరు వైద్యులు అసలు నాడిపట్టేందుకు ఇష్టపడటం లేదు. వార్డుల్లో రౌండ్లకు వచ్చినా.. రోగికి దూరం నుంచి మాత్రమే వైద్యం అందిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. తమ అసిస్టెంట్లకు చెప్పి వెళ్లిపోతున్నారు. మధ్యాహ్నం 2 గంటలు దాటితే జూనియర్ వైద్యులు తప్ప.. సీనియర్ వైద్యుల దర్శనభాగం కరవవుతోంది. ఎంసీహెచ్ బ్లాక్‌లో ఏడుగురు మైక్రోబయాలజీ సిబ్బంది మెడికల్ కళాశాలకు వెళ్లకుండా అక్కడే కాలం వెళ్లదీస్తున్నట్లు తెలిసింది. రాత్రి డ్యూటీ చేయాల్సి ఉన్నా.. చేయడం లేదు. స్కానింగ్‌కు రేపు రావాలంటూ పంపేస్తున్నట్టు సమాచారం.

టిక్..టిక్.. టిక్..!

ఉదయం 9 గంటలకు ఒక్కొక్కరుగా రోగులు ఆస్పత్రికి రావడం మొదలు పెట్టారు.. 9.30 గంటలకు ఓపీ కౌంటర్లు రోగులు, వారి బంధువులతో కిక్కిరిసిపోయాయి.. ఓపీ నమోదు కోసం బారులు దీరారు. ఒక్కో రోగి ఓపీ చీటీ పొందేందుకు రెండు గంటల పాటు వేచి చూడాల్సి వచ్చింది. రోగులు కూర్చునేందుకు కుర్చీలు సైతం ఏర్పాటు చేయకపోవడంతో గంటల తరబడి నిలబడాల్సిన పరిస్థితి కనిపించింది. కొంతమంది నిలబడలేక నీరసించిపోయిన దృశ్యాలు కనిపించాయి. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి ప్రతి రోజూ 800 మందికి పైగా రోగులు ఓపీకి వస్తుంటారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఓపీ ఇస్తున్నారు. మహిళలకు 2, పురుషులకు 2 చొప్పున కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఓపీ పొందినవారు వైద్య సేవలు పొందేందుకు ఆయా విభాగాల వద్దకు పరుగులు తీశారు. క్యూ లో వృద్ధులు నిల్చోలేక అవస్థలు పడ్డారు.

మరిన్ని సమస్యలు ఇలా..

- **ఎక్స్‌రే విభాగంలో పాత** పరికరాలతోనే కాలం **నెట్టేస్తున్నారు. ప్రింటర్లు** పూర్తిగా పాడైపో**యాయి. ఎక్స్‌రేలో చి**త్రం సక్రమంగా కనిపించ**డం లేదని రోగులు** ఆవేదన చెందుతు**న్నారు. తక్కువగా ఉ**న్న సిబ్బంది విశ్రాంతి **లేకుండా పనిచేస్తుండ**టంతో రేడియేషన్‌తో **అనారోగ్యం బారిన** పడుతున్నారు. గంటల **తరబడి వేచి చూడాల్సి**న పరిస్థితి నెలకొంది.
- **గత వైఎస్సార్ సీపీ** ప్రభుత్వంలో కొత్త సిటీ **స్కాన్ యంత్రాన్ని అం**దుబాటులోకి తీసుకువ**చ్చింది. యంత్రాన్ని వి**నియోగించేందుకు పూర్తి **స్థాయి సిబ్బంది లేక రో**గులకు ఆ సేవలు అం**తంత మాత్రంగానే అం**దుతున్నాయి. మూడు షిఫ్ట్‌ల్లో ముగ్గురు టెక్నీషియన్లు, జనరల్ షిఫ్ట్‌లో ఒక టెక్నీషియన్ మొత్తం నలుగురు ఉండాలి. ఒకరే జనరల్ షిఫ్ట్‌లో పనిచేస్తున్నారు. దీంతో మూడు షిఫ్ట్‌ల్లో సుమారు 70 వరకు సిటీస్కాన్‌లు చేయాల్సి వుండగా ప్రస్తుతం 25 స్కాన్‌లు మాత్రమే రోజుకు అవుతున్నాయి.
- జనరేటర్ సదుపాయం లేకపోవడంతో కరెంట్ పోతే ఇన్‌పేషెంట్లు అంధకారంలో మగ్గాల్సిన పరిస్థితి తలెత్తుతోంది.
- ఆస్పత్రిలో సరైన భద్రత లేదు. రాత్రి సమయాల్లో బయటి వ్యక్తులు తప్పతాగి ఆస్పత్రికి వస్తున్నారు. సెక్యూరిటీ సిబ్బంది పట్టించుకోవడం లేదు.
- ఈసీజీ యంత్రం ఒకటే పనిచేస్తోంది. రోగి వద్దకు యంత్రాన్ని తోసుకుని వెళ్లి ఈసీజీ తీయాల్సి ఉన్నా.. రోగినే గది వద్దకు మోసుకుని వచ్చి ఈసీజీ తీస్తున్నారు. దీంతో ఓపీలో ఈసీజీ తీయించుకోవాలంటే 3 గంటల పాటు వేచి చూడాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. ఈసీజీకి ముగ్గురు సిబ్బంది ఉండాల్సింది ఇద్దరే ఉన్నారు.
- ఎక్కువ శాతం ఎమర్జెన్సీ, కిడ్నీ సంబంధిత కేసులన్నీ కాకినాడ సర్వజన ఆస్పత్రికి రిఫర్ చేసేస్తున్నారు.
- రోగులకు అందించే ఆహారం సైతం నాణ్యతగా ఉండటం లేదని రోగులు ఆరోపిస్తున్నారు.

కాకినాడ వెళ్లమన్నారు



కిడ్నీ సంబంధిత వ్యాధితో ఇబ్బంది పడుతున్నా. పొద్దునే వచ్చి లైన్‌లో ఉండి ఓపీ చీటీ రాయించుకుని డాక్టర్ దగ్గరకు వెళ్లి చూపించుకున్నాను. ఆయన చూసి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి వెళ్లిపోమని చెప్పారు. ఇక్కడకు వచ్చి వైద్యం చేయించుకోవడానికే డబ్బు లేదు. కాకినాడ వెళ్లి ఇక వైద్యం ఏం చేయించుకుంటాం. మా బాధలు ఎవరూ పట్టించుకోరా?

– పిదం పరదేశి, రాజానగరం, తూర్పుగోదావరి జిల్లా

మందులు రాసి పంపేశారు



కూలీ పనులు చేసుకుని జీవితం సాగిస్తుంటా. అలా చేసుకుంటుండగా బోదెలో పడిపోయాను. తుంటిభాగంలోని చట్టకు బాగా తగలడంతో నొప్పి భరించలేక ఆసుపత్రికి వచ్చాను. ఏవో మందులు రాసి పంపేశారు. ఆ మందులు తీసుకునేందుకు గంటకుపైగా లైనులో నిలుచున్నాను. అసలే కాలు నొప్పితో బాధపడుతుంటే, లైనులో నిలుచుని మందులు తీసుకునేసరికి నొప్పి మరింత ఎక్కువైంది.

–కె.గంగయ్య, కాతేరు, రాజమహేంద్రవరం



ఓపీ కోసం వేచి ఉన్న రోగులు, వారి బంధువులు



ఆర్థో విభాగం వద్ద వేచి చూస్తున్న రోగులు

న్యూస్‌రీల్

బాధ్యతల స్వీకరణ



కలెక్టర్ ప్రశాంతికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జేసీ చిన రాముడు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఎస్.చిన రాముడు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ పి.ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, కలెక్టరేట్ సిబ్బంది, ఇతర శాఖల అధికారులు అభినందనలు తెలిపారు.

మహిళలను గౌరవించాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ పురందేశ్వరి, కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం సిటీ: మహిళలను గౌరవించడం ఇంటి నుంచే ప్రారంభం కావాలని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. బుధవారం రాజమహేంద్రవరం శ్రీ వేంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో నిర్వహించిన బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంపీ మాట్లాడుతూ సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను చట్టాల ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ డి.నరసింహ కిషోర్, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఐసీడీఎస్ పీడీ విజయకుమారి పాల్గొన్నారు.

స్ఫూర్తివంతంగా..

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): హర్ ఘర్ తిరంగ వేడుకల్లో అన్ని వర్గాల ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ విభాగాలను భాగస్వామ్యం చేసేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులకు 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం నిర్వహణపై టెలి కాన్ఫరెన్స్ ద్వారా సూచనలు చేశారు. ఆయా ఫొటోలను వెబ్ సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

మహిళామూర్తుల పోరాట స్ఫూర్తి





శివరాజు సుబ్బమ్మ



గుజ్జు నాగరత్నం



దువ్వూరి సుబ్బమ్మ



గూడురి నాగరత్నం



పాలకోడేటి శ్యామలాంబ



మద్దూరి వెంకటరమణమ్మ



కాశీభట్ల రమణమ్మ



తల్లాప్రగడ విశ్వసుందరమ్మ

- స్వాతంత్య్ర పోరాటంలో మహిళల ముందంజ
- రాజమహేంద్రవరం కేంద్రంగా ఉద్యమాలు
- తెల్లదొరలకు తలవంచని యోధులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): దేశ స్వాతంత్య్రం కోసం ఎందరో మహానుభావులు పోరాటం చేశారు. తమ జీవితాలను త్యాగం చేసి మనకు స్వేచ్ఛను అందించారు. వారందరి త్యాగఫలంతో నేడు మనం సంతోషంగా జీవనం సాగిస్తున్నాం. స్వాతంత్య్ర ఉద్యమంలో పురుషులతో పాటు మహిళలు సైతం కదం తొక్కారు. గుండె ధైర్యంతో బ్రిటీష్ పాలకులకు ఎదురు నిలిచారు. వారిలో మన రాజమహేంద్రవరంలో పుట్టిన, ఇక్కడకు కోడళ్లుగా వచ్చిన వారు చాలా మంది ఉన్నారు. వీరందరూ ఈ గడ్డ నుంచి పోరాటం సాగించారు. బ్రిటీష్ పాలకుల లాఠీ దెబ్బలను కూడా లెక్క చేయలేదు. జైలు జీవితాన్ని కూడా ఆనందంగా అనుభవించారు. మిగిలిన వారిలో స్వాతంత్య్ర స్ఫూర్తిని రగిలించారు. వీరి త్యాగాలకు గుర్తుగా రాజమహేంద్రవరంలోని కోటిపల్లి బస్టాండ్ సమీపంలోని గల ఫ్రీడమ్ పార్కులో ఈ మహిళల విగ్రహాలను ఏర్పాటు చేశారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఆ వీరనారీమణుల త్యాగాలు, పోరాటాన్ని గుర్తు చేసుకుందాం.

వీరనారీమణులు

స్వాతంత్య్రం కోసం పోరాటం చేసిన మహిళలలో దేశ భక్తి, దైవభక్తి పరాయణురాలు శివరాజు సుబ్బమ్మ, 16 నెలలు కఠిన కారాగారశిక్ష అనుభవించిన గుజ్జు నాగరత్నం, ఖద్దరును భుజాన వేసుకుని తిరిగిన దువ్వూరి సుబ్బమ్మ, ధీర మహిళగా పేరు తెచ్చుకున్న గూడురి నాగరత్నం, జైలు జీవితం అనుభవించిన పాలకోడేటి శ్యామలాంబ, ఉద్యమం కోసం జీవితాన్ని త్యాగం చేసిన మద్దూరి వెంకట రమణమ్మ, జైలులోనే ప్రసవించిన కాశీభట్ల రమణమ్మ, సాహిత్యాన్ని సంస్కరణలో ఉపయోగించిన తల్లాప్రగడ విశ్వసుందరమ్మ, సాహస నారిగా పేరు తెచ్చుకున్న దుర్గాబాయ్ దేశముఖ్ తదితరులు ముఖ్యులు.

గాంధీ నడయాడిన నేల

అనేక మంది స్వాతంత్య్ర పోరాట యోధులు రాజమహేంద్రవరంలో అడుగుపెట్టారు. వారి పాదస్పర్శతో ఈ ప్రాంతం పునీతమైంది. ఆనాటి గుర్తులు ఇప్పటికీ మనలో ఉత్తేజాన్ని నింపుతూనే ఉన్నాయి. ప్రముఖ స్వాతంత్య్ర పోరాట యోధుడు, గాంధేయవాది డాక్టర్ బ్రహ్మజోస్యుల సుబ్రమ్మణ్యం స్థాపించిన సీతానగరం ఆశ్రమాన్ని గాంధీజీ 1929 మే 8వ తేదీన తొలిసారిగా దర్శించారు. అప్పుడు ఆయన ఆశ్రమంలో రెండు రోజులు ఉన్నారు. ఆయనతో పాటు కస్తూర్బా, ప్రైవేటు కార్యదర్శి ప్యారీలాల్, జయప్రకాష్ నారాయణ్ సతీమణి ప్రభావతి, దక్షిణాఫ్రికాలో గాంధీజీ సహచరుడు ఇమాం సాహెబ్, దేవభక్త కొండా వెంకటప్పయ్య, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ తదితరులు ఉన్నారు. అది వేసవి కావడంతో మహాత్ముడి బస కోసం ప్రత్యేకంగా ఒక ఆశ్రమాన్ని నిర్మించారు. నేటికీ ఈ ఆశ్రమం పదిలంగా ఉంది. ఇటీవల పైకప్పు మాత్రం మార్చారు. ఇందులో ఆయన ఉపయోగించిన రాట్నం ఇప్పటికీ ఉంది. అలాగే 1933లో గాంధీజీ రెండోసారి ఆశ్రమాన్ని సందర్శించారు. ఆశ్రమం నిర్వహణపై యంగ్ ఇండియాలో గాంధీజీ ప్రశంసలతో కూడిన వ్యాసాన్ని రచించారు.

మన్యంలో విప్లవాగ్ని రగిలించిన చంద్రయ్య

అల్లూరి సీతారామరాజుకు ముందే మన్యంలో విప్లవాగ్నిని రగిలించిన గోదావరి జిల్లాల తొలి పోరాట యోధుడు ద్వారబంధాల చంద్రయ్య దొర. ఖమ్మం, తూర్పు, పశ్చిమ గోదావరి, విశాఖ జిల్లాలో పాటు మధ్యప్రదేశ్, ఒడిశా సరిహద్దు ప్రాంతాలు, తూర్పు గోదావరి మెట్ట, మన్యం ప్రాంతాలలో బ్రిటీష్ సామంతులపై అలుపెరగని పోరాటం చేశారు. ఆంగ్లేయల అడుగులకు మడుగులొత్తుతున్న సామంతులు, జమీందారులు, మొఖాసా, పెత్తందారులు ఇలా నాటి నిరంకుశత్వ పాలకులపై అలుపెరగని పోరుసల్పి గిరిజన, దళిత, వెనుకబడిన పీడిత వర్గాలకు ఆరాధ్యుడయ్యారు.

నేతాజీ రాక

నేతాజీ సుభాస్ చంద్రబోస్ 1939 తర్వాత రాజమహేంద్రవరం విచ్చేశారు. నగరంలోని దేవతా శ్రీరామమూర్తి ఇంటిలో బస చేశారు. దేవతా శ్రీరామమూర్తిని జెండా వీరుడుగా పిలిచేవారు.

పాల్‌చౌక్

బిపిన్ చంద్రపాల్ 1907 ఏప్రిల్ 19, 20, 21 తేదీలలో రాజమహేంద్రవరంలోని కోటిపల్లి బస్టాండ్ ప్రాంతంలో బహిరంగ సభలో ప్రసంగించారు. అప్పటి నుంచి ఆ ప్రాంతాన్ని పాల్ చౌక్‌గా పిలుస్తున్నారు. వీరితో పాటుగా ఆంధ్ర నేతాజీగా పేరుగాంచిన మద్దూరి అన్నపూర్ణయ్య, క్రొవ్విడి లింగరాజు, చంద్రబట్ల హనుమంతరావు, వావిలాల గోపాలకృష్ణ, నీలం భీమ్ రాజ్, మామిడి లక్ష్మీపతి, మానాప్రగడ వెంకట కృష్ణారావు, మాకొద్ది తెల్లదొరతనం అనే జాతీయపాటను ఉద్యమ గీతంగా మార్చిన గరిమెళ్ల సత్యనారాయణ, టంగుటూరి ప్రకాశం పంతులు, బొలుసు సాంబమూర్తి, బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం వంటి ఎందరో మహానుభావులు తూర్పుగోదావరి జిల్లా నుంచి స్వాతంత్య్ర ఉద్యమ స్ఫూర్తిని రగిలించారు.

దాడులు ఆపకుంటే పెద్ద ఎత్తున ఉద్యమం

రామేశ్వరంలో వైఎస్సార్ సీపీ నేతపై దాడి



రామేశ్వరంలో బాధితుడు రవిశంకర్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: అనపర్తి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ శ్రేణులపై ఎన్డీఏ కూటమి దాష్టీకాలు రోజు రోజుకు పెరుగుతున్నాయని, వెంటనే దాడులను ఆపకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పెదపూడి మండలం రామేశ్వరంలో మంగళవారం రాత్రి స్థానిక సర్పంచ్ కొటికలపూడి చినబాబు అల్లుడు వైఎస్సార్ సీపీ నేత ముమ్మిడి రవిశంకర్‌పై అదే గ్రామానికి చెందిన దూళ్ల కిరణ్ దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. జై టీడీపీ.. జై జనసేన అంటూ నినాదాలు చేస్తూ దాడికి పాల్పడ్డాడని తెలిపారు. దాడికి పాల్పడిన వ్యక్తిపై చట్టపరంగా కేసు నమోదు చేసి క్రిమినల్ చర్యలు తీసుకోవాల్సిందిగా ఘటనా స్థలానికి చేరుకున్న పెదపూడి ఎస్సై శోభన్‌కుమార్‌ను డిమాండ్ చేశారు. బాధితుడిని మాజీ ఎమ్మెల్యేతో పాటు వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ జీ.వీ.రమణ, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి వాసు, గ్రామ కన్వీనర్ గాజుల మణికంఠ, ఏపీ త్రయం మాజీ సొసైటీ చైర్మన్ గుండా ఈశ్వరరావు పరామర్శించారు.




ఎస్సై శోభన్‌కుమార్‌తో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పోలవరం త్వరగా పూర్తి చేయాలి

బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు కిరణ్‌కుమార్‌రెడ్డి

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): రాష్ట్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలని మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాజమహేంద్రవరంలోని బీజేపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే ఐదేళ్ల పాలన చంద్రబాబుకు పెను సవాల్ అని అన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేసిన అనుభవం కలిసి వచ్చే అంశమని తెలిపారు. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టును ప్రభుత్వం తర్వితగతిన పూర్తి చేయవలసిన అవసరం ఉందన్నారు. పోలవరానికి ఉన్న అంతర్రాష్ట్ర సమస్యలను పరిష్కారించుకోవాలన్నారు. ఎన్నికల తర్వాత పవన్ కళ్యాణ్ పవర్ స్టార్ అయ్యారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో శాంతి భద్రతలను పరిరక్షించలేకపోయారని ఆరోపించారు. పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, అనపర్తి ఎమ్మెల్యే నల్లిమిల్లి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి. చిత్రంలో సోము వీర్రాజు, ఎమ్మెల్యే నల్లిమిల్లి

క్లుప్తంగా

బల్బులో భారత పతాకం

జాతీయాభిమానం చూపిన డ్రాయింగ్ మాస్టర్


బల్బులో రూపొందించిన జాతీయ జెండా

రామచంద్రపురం రూరల్: చిత్రలేఖకులు సహజంగానే సృజనాత్మక శక్తితో ఉంటారు. వారి ఆలోచనలకు నిరంతరం పదును పెడుతూనే ఇంకా విభిన్నంగా ఏం చేయొచ్చనే ఆలోచనతో ఉంటారు. అలాంటి విభిన్నమైన ఆలోచనతోనే స్థానిక రామచంద్రపురం మండలం హసన్‌బాద జెడ్పీ హైస్కూల్‌లో డ్రాయింగ్ టీచర్ జి.శ్రీను స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యుత్ బల్బులో జాతీయ పతాక చిహ్నాన్ని రూపొందించి ఔరా అనిపించారు. ద్రాక్షారామకు చెందిన ఆయన అబ్బురాన్ని వివరిస్తూ బల్బులో ఫిలమెంట్ తీసేసి ఖాళీ చేశారు. అనంతరం సాల్ట్‌తో సగం వరకు నింపారు. అనంతరం థర్మోకూల్ ముక్కలను దానిలోకి చొప్పించారు. తరువాత జెండాలోని రంగులు ఉన్న కొవ్వొత్తులను కరిగించి అందులో కావలసిన డిజైన్ మేరకు వేశారు. తరువాత నీటి సాయంతో ఉప్పును, థర్మోకూల్ ముక్కలను తొలగించి, అనంతరం నీలం దారంతో అశోక చక్రాన్ని తయారు చేసి మధ్యలో అమర్చి ఈ కళాఖండాన్ని తయారు చేశారు. దీనిని గమనించిన సహోపాధ్యాయులు ఆయన ప్రతిభను అభినందించారు.


కళాఖండం రూపశిల్పి శ్రీను

అలరించిన 'స్వేచ్ఛా దేశం'



త్రినాథప్రసాద్ వేసిన చిత్రం


రాయుడు త్రినాథప్రసాద్

రామచంద్రపురం రూరల్: బ్రిటిష్ వారి పంజరంలో చిక్కుకుని ఉన్న భారతదేశానికి దేశ స్వాతంత్ర్య సమర యోధులు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం అనే రెండు రెక్కలను అందించారని చూడగానే ఇట్టే అర్థమయ్యేలా చిత్రాన్ని వేశారు. రామచంద్రపురం మండలం నరసాపురపుపేట జెడ్పీ హైస్కూల్ డ్రాయింగ్ టీచర్ రాయుడు త్రినాథప్రసాద్. పాఠశాల ప్రధానోపాధ్యాయిని కేకేఎల్ కుమారి, సహ ఉపాధ్యాయులు, విద్యార్థులు డ్రాయింగ్ టీచర్ త్రినాథ ప్రసాద్‌ని ప్రత్యేకంగా అభినందించారు.

సహస్ర కాంతుల కర్పూరం

- అధిక ధర పలుకుతున్న అరటి రకం
- శ్రావణమాసం, పెళ్లిళ్లతో పెరిగిన వినియోగం
- రావులపాలెం అరటి మార్కెట్ యార్డు పరిధిలోనే అధిక దిగుబడి
- దీంతో ధరలో పెరుగుదల
- ఎండలు, ఈదురుగాలు, వరదలతో సుమారు 50 శాతం అరటి చెట్లు ధ్వంసం



అరటి విక్రయాలతో కళకళలాడుతున్న రావులపాలెం అరటి మార్కెట్ యార్డు. (అంతరచిత్రం) అధిక ధర పలుకుతున్న కర్పూర రకం అరటి గెలలు

రావులపాలెం: రెండు నెలలుగా ఓ మాదిరిగా ఉన్న అరటి ధరలు 20 రోజులుగా పెరుగుతూ రైతుకు లాభాలు తెచ్చిపెడుతున్నాయి. శ్రావణ మాసం, పెళ్లిళ్ల వల్ల రాష్ట్రంలో వినియోగం పెరగడంతో పాటు, వరుసగా కృష్ణాష్టమి, వినాయక చవితి, దసరా పండగలు రావడంతో రైతుల పంట పండుతోంది. కొద్ది రోజుల పాటు ఇదే ఊపు కొనసాగే అవకాశం ఉందని రైతులు, వ్యాపారులు అంటున్నారు. రావులపాలెం అరటి మార్కెట్ యార్డు పరిధిలో ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలో రావులపాలెం, కొత్తపేట, ఆత్రేయపురం, ఆలమూరు, మండపేట, పి.గన్నవరం, సిద్ధాంతం మండలాలతో పాటు, ఖండవల్లి, పెరవలి, పెనుగొండ తదితర ప్రాంతాల్లో సుమారు 12 వేల హెక్టార్లలో ఈ మార్కెట్ యార్డు పరిధిలో అరటి సాగవుతోంది. వీటిలో ప్రధానంగా ఆరు రకాల అరటి సాగవుతోంది. సుమారు 70 శాతం కర్పూర రకం అరటి సాగు ఉంటుంది. 20 శాతం చెక్కరకేళి రకం (తెలుపు, ఎరుపు) మిగిలిన 10 శాతం బొంత, బుషావళి, అమృతపాణి రకాలు ఉంటాయి. సీజన్‌లో అంటే మార్చి నుంచి జూన్, జూలై నెలల వరకూ సగటున రోజుకు 25 వేల నుంచి 30 వేల అరటి గెలలను రైతులు రావులపాలెం అరటి మార్కెట్ యార్డుకు తీసుకువస్తుంటారు. దీంతో రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వ్యాపారం సాగుతోంది.

ఉత్పత్తి లేక..

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల వ్యాప్తంగా ఎక్కడా అరటి దిగుబడి లేకపోవడం, అలాగే విశాఖ, సాలూరు, పార్వతీపురం ఇలా ఇతర జిల్లాల్లో కూడా దిగుబడి లేకపోవడంతో రావులపాలెం అరటి మార్కెట్ యార్డులో ఇప్పుడు అమాంతం ధరలు ఎప్పుడూ లేని విధంగా రెట్టింపు రావడంతో రైతులు, వ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మే, జూన్ నెలల్లో వచ్చిన **ఈదురుగాలులకు చాలా చోట్ల అరటి చెట్లు విరిగిపోవడంతో పాటు, వరదల కారణంగా లంక ప్రాంతాల్లో అరటిపంటలు పాడవడం ఒక కారణం అయితే ప్రస్తుతం మార్కెట్‌యార్డు పరిధిలో మాత్రమే అరటి గెలల దిగుబడి ఉండటంతో మార్కెట్‌కు రోజుకు ఏడు వేల నుంచి తొమ్మిది వేల అరటి గెలలు వస్తున్నాయి. సుమారు 6 వేల హెక్టార్లలో పంట అందుబాటులో ఉండటం, అధిక శాతం కర్పూర, చెక్కరకేళి తెలుపు రకాలు** అధికంగా మార్కెట్‌కు వస్తున్నాయి. దీంతో నాసి రకం కర్పూర గెల రూ.300, మోటు గెల రూ.వెయ్యి వరకూ పలుకుతోంది. సహజంగా సీజన్‌లో రావులపాలెం మార్కెట్ యార్డు నుంచి ఒడిషా, బీహార్, జార్ఖండ్, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు, రాష్ట్రంలో విశాఖ, పార్వతీపురం, గుంటూరు, నంద్యాల, కర్నూలు, చిత్తూరు తదితర ప్రాంతాలకు ఎగుమతి అవుతుంటాయి. ప్రస్తుతం తమిళనాడు, ఒరిస్సా, తెలంగాణ రాష్ట్రాలకు, రాష్ట్రంలో విశాఖ, సాలూరు, పార్వతీపురం, గుంటూరు తదితర ప్రాంతాలకు ఎగుమతులు అవుతున్నాయి.

విశ్వకర్మ జయంతి నేపథ్యంలో ఒడిషా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అరటిని అధికంగా వినియోగిస్తుండటంతో ఆ రాష్ట్రాలకు అధికంగా అరటి గెలలు ఎగుమతవుతున్నాయి.

నెలన్నర వ్యవధిలో అరటి ధరల్లో వ్యత్యాసాలు ఇలా ఉన్నాయి..

అరటి రకం	జూన్ చివరి వారం		ప్రస్తుత ధరలు	
	కనిష్ట	గరిష్ట	కనిష్ట	గరిష్ట
కర్పూర	150	350	300	1000
చక్కెరకేళీ (తెలుపు)	150	350	400	700
బుషావళి	100	200	200	800
బొంత (కూర అరటి)	100	250	200	500
అమృతపాణి	100	250	350	900
చక్కెరకేళీ (ఎరుపు)	150	400	350	800

అక్టోబర్ నెల వరకూ ఆశాజనకమే



ఎక్కడా సరకు లేకపోవడంతో అరటి ధరలు బాగున్నాయి. ప్రస్తుతం మన గోదావరి జిల్లాల సరకు అందుతున్న సమయంలో ఈదురుగాలులు కొంత దెబ్బతీశాయి. దీంతో దిగుబడి తగ్గింది. ఉన్న గెలలకు ధరలు బాగా పెరిగాయి. సరకు లేకపోవడంతో అక్టోబర్ వరకూ ఇదే పరిస్థితి ఉంటుంది. అక్టోబర్ చివరి నాటికి, నవంబర్ నెలలో ఇతర రాష్ట్రాలు, ఇతర జిల్లాల్లో కూడా అరటి పంట మరింతగా అందివచ్చే అవకాశం ఉంది. అప్పటిదాకా అరటి ధరకు ఇబ్బంది లేదు.
– కోనాల చంద్రశేఖరరెడ్డి, అరటి వ్యాపారి, ఊబలంక

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

గండేపల్లి: విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందినట్టు గండేపల్లి ఎస్సై యూవీ శివనాగబాబు తెలిపారు. మండలంలోని నీలాద్రిరావుపేటకు చెందిన గండికోట వీరబాబు (44) కూలీ పని నిమిత్తం యల్లమిల్లిలో వాటర్ పైపులైన్ వేసేందుకు వెళ్లి అక్కడ బ్రేకర్ ద్వారా సీసీ రోడ్డు బ్రేక్ చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు బ్రేకర్‌కు కరెంట్ పాసై వీరబాబుకు విద్యుత్ షాక్ తగలడంతో అపస్మారకస్థితికి చేరుకున్నాడు. ఇతనిని చికిత్స నిమిత్తం ప్రైవేటు వాహనంలో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు. మృతుని భార్య దుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్టు తెలిపారు.

మహిళ మెడలో సూత్రాల తాడు అపహరణ

అంబాజీపేట: షాపులో పని ముగించుకుని ఇంటికి నడిచి వెళ్తున్న ఓ మహిళ మెడ నుంచి మంగళ సూత్రాల తాడును ఇరువురు యువకులు అపహరించుకుపోయారు. బాధితురాలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ముక్కామల పంచాయతీ పరిధి బుద్ధానగర్‌కు చెందిన మోరంపూడి నాగమణి స్థానికంగా ఓ షాపు నిర్వహించుకుంటున్నారు. షాపులో పని ముగించుకుని మంగళవారం రాత్రి సుమారు 9 గంటల ప్రాంతంలో ఇంటికి ఒంటరిగా నడిచి వెళ్తుండగా బైకుపై వచ్చిన ఇరువురు యువకులు ఆమె మెడలోని రెండున్నర కాసుల బంగారు సూత్రాల తాడును అపహరించుకుపోయారు. ఆమె బిగ్గరగా కేకలు వేసినా చుట్టు పక్కల ఎవ్వరూ లేకపోవడంతో ఫలితం లేకుండా పోయింది. దాంతో అంబాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వై.సూర్యనారాయణ తెలిపారు.

పాల కల్తీ యూనిట్‌పై దాడి

- పాలు, పెరుగు, నెయ్యి నమూనాల సేకరణ
- సెక్షన్ 63 కింద కేసు నమోదు


పాల యూనిట్‌ను తనిఖీ చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

బోట్‌క్లబ్: కాకినాడలోని స్థానిక ప్రతాప్‌నగర్‌లో ఎటువంటి అనుమతులు లేకుండా పాలు, నెయ్యి, పెరుగు విక్రయిస్తున్న యూనిట్‌పై ఫుడ్‌సేఫ్టీ అధికారులు బుధవారం దాడులు చేశారు. నూకరాజు అనే వ్యక్తి అమూల్ పాలు, పాల పౌడర్, రైతుల దగ్గర నుంచి కొన్ని పాలు కొనుగోలు చేసి వాటిని పెరుగు, పాలు, నెయ్యిగా చేసి విక్రయిస్తున్నట్టు గుర్తించారు. అపరిశుభ్ర వాతావరణంలో ఈ యూనిట్ నిర్వహించడమే కాకుండా ఎటువంటి అనుమతులు లేకపోవడంతో పాటు వీటిని తయారుచేసేందుకు వినియోగించే పరికరాలు చాలా అధ్వానంగా ఉన్నాయని జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ శ్రీనివాస్ తెలిపారు. నూకరాజుకు గాంధీనగర్ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న అన్నపూర్ణ మిల్క్ డైరీ నుంచి బాదం పాలు, పెరుగు శాంపిల్ తీసి ల్యాబ్‌కు పంపుతున్నట్లు చెప్పారు. ఈ మేరకు సెక్షన్ 63 కింద కేసు నమోదు చేసినట్లు చెప్పారు. తయారీ యూనిట్‌ను తాత్కాలికంగా మూసివేసినట్లు చెప్పారు. జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు దాడుల్లో పాల్గొన్నారు.

మహిళా సమానత్వంతోనే ప్రగతి

- జిల్లా స్థాయి అధికారుల శిక్షణలో ఈటీసీ ప్రిన్సిపాల్ వేణుగోపాల్
- ముగిసిన మూడు రోజుల శిక్షణ

సామర్లకోట: మహిళా సమానత్వంతోనే అన్ని రంగాల్లో ప్రగతి సాధ్యమవుతుందని విస్తరణ శిక్షణ కేంద్రం (ఈటీసీ) ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ అన్నారు. శ్రీకాకుళం, విజయ నగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లోని జిల్లా స్థాయి అధికారులకు సోమవారం ప్రారంభమైన శిక్షణ బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల నుంచి అభివృద్ధి జరగాలనే లక్ష్యంతో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను ప్రతి రాష్ట్రంలో అమలు చేయాలని ఆదేశించిందన్నారు. ఈ మేరకు జిల్లా స్థాయి అధికారులకు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై అవగాహన కల్పించడానికి ఈటీసీల ద్వారా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. పేదరికం లేని, ఆరోగ్యకరమైన, పిల్లలో స్నేహపూర్వకంగా, నీటి సమృద్ధి కలిగిన, పరిశుభ్రమైన, మౌళిక సదుపాయాలు కలిగిన, సామాజిక భద్రత కలిగిన, సుపరిపాలన కలిగిన, మహిళా స్నేహపూర్వక గ్రామాలు అనే థీమ్‌లపై శిక్షణ ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఇప్పటికి ఐదు థీమ్‌లపై ఐదు బ్యాచ్‌లలో శిక్షణ ఇచ్చామన్నారు. 5వ బ్యాచ్‌లో మహిళా స్నేహపూర్వక గ్రామం అనే థీమ్‌పై పూర్తి చేశామన్నారు. మహిళా హక్కులకు భంగం కలుగకుండా చేయాల్సిన బాధ్యత జిల్లా స్థాయి అధికారులపై ఉన్నదని ఆయన చెప్పారు. స్థానిక అభివృద్ధి ఎజెండాను ఏర్పాటు చేయడంలో, అభివృద్ధికి ఉన్న అడ్డంకులకు పరిష్కారం కనుగొనేలా గ్రామాభివృద్ధి ప్రణాళికలను తయారుచేసుకోవాలని సూచించారు. ఈ మేరకు ప్రతి గ్రామంలో గ్రామ సభలు ఏర్పాటు చేసి మహిళల అభిప్రాయాలను స్వీకరించాలని సూచించారు. శిక్షణ ముగింపును పురస్కరించుకుని మూడు రోజుల పాటు నేర్చుకున్న అంశాలపై అధ్యయనం చేసి, రాత పరీక్ష నిర్వహించి శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులకు జిల్లాల వారిగా సర్టిఫికేట్లు అందజేశారు. ఈ ముగింపు శిక్షణలో వైస్ ప్రిన్సిపాల్ ఇ.కృష్ణమోహన్, ఫ్యాకల్టీలు జీవీఎస్ శ్రీదేవి, ఎం చక్రపాణిరావు, బి.వెంకటేశ్వర్లు, బి.ఆంజనేయులు, కేఆర్ నిహారిక, డీఆర్ఎన్ పద్మజ, వి.ప్రసాద్ శిక్షణ తరగతులు నిర్వహించారు.


శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులకు సర్టిఫికెట్లు అందజేసిన ప్రిన్సిపాల్ వేణుగోపాల్

నేర్చుకున్న పాఠాలతో ప్రతిభ సాధ్యం


వర్క్‌షాపులో పాల్గొన్న ప్రగతి ఇంజినీరింగ్ విద్యార్థులు, అధ్యాపకులు

గండేపల్లి: నేర్చుకున్న పాఠాలతో ప్రతిభను పెంపొందించుకోవాలని ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పరుచూరి కృష్ణారావు పేర్కొన్నారు. మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో ×ఫుల్ స్టాక్ ఫండమెంటల్స్ క్రియేటింగ్ ఇంటరాక్టివ్ డేటా డ్రివెన్ వెబ్ అప్లికేషన్స్×పై మూడు రోజుల పాటు నిర్వహించిన సదస్సుకు చివరి రోజు బుధవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అప్లికేషన్లలో ఉండే వివిధ ప్రక్రియలు ప్రాజెక్టులు చేయడానికి అనుసరించాల్సిన ప్రణాళికలను నిశితంగా, అనుభవ పూర్వకంగా నేర్చుకున్నారని, ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సాంకేతిక ప్రతిభను పెంపొందించుకునేందుకు దోహదపడతాయన్నారు. హైదరాబాద్ బ్రెయినోవిజన్ ఎక్స్‌పర్ట్ ట్రైనర్ డి.ఓబుల్ మరో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడం ద్వారా విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు సాధించడానికి ఉపయోగపడతాయన్నారు. కళాశాల డేటా సైన్స్ విభాగం వారు ద్వితీయ సంవత్సర విద్యార్థులకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వి.హరనాథబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్, ప్రిన్సిపాల్ జి.నరేష్, డేటా సైన్స్ విభాగాధిపతి ఎంవీ రాజేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కరప: ప్రియురాలికి వివాహం నిశ్చయమైందని తెలుసుకుని, మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కరప మండలం జెడ్.భావారం గ్రామానికి చెందిన వెంకటరమణ కుమారుడు పలివెల విజయ్‌కుమార్ (22) ఆటో డ్రైవర్. పెద్దాపురానికి చెందిన ఒక యువతిని ప్రేమించి వివాహం చేసుకోవాలనుకుని నిశ్చయించుకున్నారు. నాలుగు రోజుల క్రితం ఆ యువతికి పెళ్లి కుదిరిందని తెలిసింది. దీంతో జీవితంపై విరక్తి చెందిన విజయ్‌కుమార్ ఈ నెల 13వ తేదీన మధ్యాహ్నం గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతనిని చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ మేరకు ఎస్ఐ టి.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుమార్తెపై లైంగిక వేధింపులు : కేసు నమోదు

కిర్లంపూడి: కుమార్తెపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న తండ్రిపై కిర్లంపూడి పోలీస్ స్టేషన్‌లో బుధవారం పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. కొన్ని రోజులుగా తండ్రి ఎవరూ లేని సమయంలో అసభ్యంగా ప్రవర్తిస్తూ వేధింపులకు గురిచేస్తున్నాడంటూ బాధితురాలు హైదరాబాద్‌లో ఉంటున్న తన తల్లికి చెప్పింది. తల్లి సూచన మేరకు కుటుంబ సభ్యుల సహాయంతో బాలిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్సై జి.సతీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాన్ మ్యాథ్స్‌లో ఉద్యోగ అవకాశాలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన నాన్ మ్యాథ్స్ గ్రూపుల (సీఈసీ, హెచ్ఈసీ, బైపీసీ, ఒకేషనల్) విద్యార్థులకు హెచ్‌సీఎల్ టెక్‌లో ఉద్యోగావకాశాలు ఉన్నాయని ఆర్‌జేడీ ఐఈ ఐ.శారద, జిల్లా ఇంటర్మీడియెట్ విద్య ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎస్‌వీఎల్ నరసింహం తెలిపారు. 2023 – 24 విద్యా సంవత్సరంలో 75 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. వీరికి ఈ నెల 20వ తేదీన రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో హెచ్‌సీఎల్ – టెక్ పరీక్ష నిర్వహిస్తామన్నారు. హాజరయ్యే విద్యార్థులు హెచ్‌టీటీపీఎస్://బిట్.ఎల్‌వై/టెక్‌బీగోఏపీ× లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఇంటర్‌బోర్డు హెచ్‌సీఎల్ టెక్‌బీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతోందన్నారు. మరిన్ని వివరాలకు సాయికిరణ్‌ను 96429 73350 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

క్విజ్ పోటీల్లో బహుమతులు



జిల్లా అధికారుల నుంచి మెమెంటోలు అందుకుంటున్న యశస్వినిశ్రీ, లక్ష్మీప్రసన్న

మామిడికుదురు: అమలాపురంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో క్విజ్ విభాగంలో మామిడికుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మేడిచర్ల తులసీదుర్గాబాలసింధు, చిట్టూరి హర్షిణి ద్వితీయ బహుమతులు సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయిని సీహెచ్ నిరంజని బుధవారం తెలిపారు. వక్తృత్వం విభాగంలో వేగి బాలవెంకటశ్రీలక్ష్మీహర్షిత తృతీయ బహుమతిని సాధించారన్నారు.

అంబాజీపేట: ఈ నెల 13న అమలాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ క్విజ్ పోటీల్లో అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు మూడో స్థానంలో నిలిచినట్టు హెచ్ఎం కె.సాయిరామ్ తెలిపారు. మూడో స్థానంలో నిలిచిన విద్యార్థులను హెచ్ఎం, ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు. ఎనిమిదో తరగతి నుంచి 12వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ కు చెందిన కుడిపూడి యశస్విని శ్రీ, ఆకుల లక్ష్మీప్రసన్నలు మూడో స్థానంలో నిలిచినట్టు సాయిరాం తెలిపారు. జిల్లాస్థాయిలో విజేతలైన విద్యార్థులను ఎస్ఎంసీ చైర్మన్ పి.త్రిమూర్తులు, వైస్ చైర్‌పర్సన్ బి.అమ్మాజీ, ఉపాధ్యాయులు అభినందించారు.

సర్దుబాటులో విద్దుబాట్లు!

- రేపటి వరకు అభ్యంతరాలపై గడువు
- ఈ నెల 17వ తేదీలోగా అవకాశం


విధి నిర్వహణలో నిమగ్నమైన ఉపాధ్యాయులు

రాయవరం: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల పని సర్దుబాటుపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అయితే సర్దుబాటు సమస్య పరిష్కర చర్యల్లో ఆదిలోనే ఉపాధ్యాయ సంఘాల నుంచి పలు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. దీనిపై తిరిగి కసరత్తు ప్రారంభించారు. ఉపాధ్యాయ సంఘాల నుంచి అనేక అభ్యంతరాలు, ప్రతిపాదనలు వచ్చిన నేపథ్యంలో పాఠశాల విద్య శాఖ డైరెక్టర్ విజయరామరాజు ఇప్పటికే ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించారు.


కొలిక్కి వచ్చేనా..

ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియను ప్రారంభిస్తూ ఈ నెల 7న విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. తొమ్మిదో తేదీన జిల్లాల వారీగా మండల విద్య శాఖాధికారులు స్థానిక ఉపాధ్యాయ సంఘాల నాయకులతో సమావేశాలు నిర్వహించారు. అయితే జీవో 117 ప్రకారం సర్దుబాటు చేపట్టడంపై ఉపాధ్యాయ సంఘాలు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేశాయి. ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఉపాధ్యాయ, విద్యార్థి (టీపీఆర్) నిష్పత్తి విషయంలో సవరణలు, సీనియారిటీని లెక్కించినపుడు ప్యానెల్ నెంబరు లేదా ర్యాంకును పరిగణలోకి తీసుకోవాలని, 70 శాతం పైబడి అంగవైకల్యం ఉన్నవారిని సర్దుబాట్లలో మినహాయించాలని పలు ప్రతిపాదనలను అధికారుల ముందు యూనియన్ నాయకులు ఉంచారు. కాని వీటిని పరిగణలోకి తీసుకోకుండా సర్దుబాట్లను చేపట్టడంతో యూనియన్ల నాయకుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఈ నెల 11న ఉపాధ్యాయ ఎమ్మెల్సీల సమక్షంలో విద్యా శాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘాల నేతల సమావేశాన్ని ఏపీ ఉపాధ్యాయ సమాఖ్య (ఫ్యాప్టో) బహిష్కరించడంతో సర్దుబాట్ల ప్రక్రియకు తాత్కాలికంగా వాయిదా వేశారు.

16 వరకు గడువు

ఉపాధ్యాయుల పని సర్దుబాటులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మండలాల వారీగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలోని మిగులు, కొరత ఉపాధ్యాయుల జాబితాను అందించాలని పాఠశాల విద్య శాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే ముందుగా జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఈ నెల 11 నాటికి ప్రక్రియ పూర్తికావాల్సి ఉంది. కాని ఈ నెల 10, 11 తేదీలలో వరుసగా సెలవులు రావడం, జీవో 117పై అభ్యంతరం తెలపడంతో సర్దుబాటుకు బ్రేక్ పడింది. పాఠశాలల వారీగా ఉపాధ్యాయుల సీనియారిటీ, సెక్షన్ల వారీగా విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల కొరత తదితర వివరాలను కమిషనర్ కార్యాలయానికి చేరవేయాల్సి ఉంది. వీటితో పాటు విల్లింగ్ కోరుకునే ఉపాధ్యాయులు, సర్దుబాట్లలో భాగంగా వేరే చోటకు వెళ్లడానికి ఉన్న అభ్యంతరాలు, సీనియారిటీ జాబితాలలో ఉన్న సవరణలను సరిచేయడానికి ఈ నెల 16వ తేదీ వరకు అవకాశం ఇచ్చారు. ఈ మేరకు గడువు ఇస్తూ పాఠశాల విద్య శాఖ హెచ్ఎంలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 13న ఆర్జేడీలు, డీఈవోలు, ఎంఈవోలతో వెబెక్స్ మీటింగ్ నిర్వహించి పలు సూచనలు చేశారు. తాజాగా అధికారులు తీసుకున్న నిర్ణయాలు ప్రకారం ఉపాధ్యాయుల పని సర్దుబాటు చేయాల్సిన అవసరం ఉన్నందున ఎక్కడ అవసరం ఉంటుందో అక్కడ మాత్రమే సర్దుబాటుకు చర్యలు తీసుకోనున్నారు. మండల స్థాయిలో ఎంఈవో పరిధిలోనే పని సర్దుబాటు జరగనుంది. అప్పటికీ మిగులు ఉపాధ్యాయులు ఉంటే అంతర్గత నిర్వహణలో సర్దుబాటు చేస్తారు. ఏ మేనేజ్‌మెంట్‌కు ఆ మేనేజ్‌మెంట్‌లోనే పని సర్దుబాటు చేస్తారు. మైనార్టీ భాషలకు సంబంధించి మినహాయింపు ఉంటుంది. 70 శాతం పైబడి ఉన్న దివ్యాంగులకు పని సర్దుబాటు నుంచి మినహాయింపు ఉంటుంది. 1–8 తరగతులు ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలకు కనీసం ఐదు ఎస్‌జీటీలు ఉండేలా చర్యలు తీసుకుంటారు. సీనియర్ ఉపాధ్యాయునికి విల్లింగ్ ఉంటే అతనికే అవకాశం ఇస్తారు. 2025 మే 31 లోపు పదవీ విరమణ చేసే ఉపాధ్యాయుల పాఠశాలలకు మినహాయింపు ఉంటుంది. పని సర్దుబాటులో భాగంగా వేరే పాఠశాలకు వెళ్లడానికి ఉపాధ్యాయులకు ఉన్న అభ్యంతరాలను చెప్పుకునే అవకాశం కల్పించాలని సూచించారు. 17వ తేదీలోగా సర్దుబాట్లు కొలిక్కి వచ్చేలా విద్య శాఖ అధికారులు తీవ్ర కసరత్తు చేస్తున్నారు.

సాక్షి ఫ్యామిలీ
రాజమహేంద్రవరం
గురువారం ॥ 15-8-2024



మూడేళ్ల కొడుకును పణంగా పెట్టి...

భగత్‌సింగ్‌ను కాపాడిన భాభీ

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌వీర్... వీరంతా ఆమెను 'దుర్గా భాభీ' అని పిలిచేవారు. సాయుధ పోరాటంతోనే బ్రిటిష్ వారిని దేశం నుంచి తరిమికొట్టగలం అని భావించిన దళంలో పిస్తోల్ పట్టిన తొలి విప్లవ వనిత దుర్గావతి దేవి. బ్రిటిష్ అధికారి సాండర్స్‌ను హత్య చేసిన భగత్‌సింగ్‌ను లాహోర్ నుంచి తప్పించేందుకు అతడి భార్య అవతారం ఎత్తిందామె. చరిత్ర పుటలలో కనుమరుగై పోయిన ఆ త్యాగమయి గురించి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా...

'సైమన్ గోబ్యాక్' నిరసన కార్యక్రమం చేస్తున్న లాలా లజపతిరాయ్ మీద బ్రిటిష్ పోలీసుల లాఠీచార్జీ జరిగి ఆయన ప్రాణం పోయింది. పంజాబ్‌లో యువతకు మార్గదర్శిగా ఉన్న ఆ మహా నాయకుణ్ణి కోల్పోయినందుకు 'హిందూస్తాన్ సోషలిస్ట్ రిపబ్లిక్ అసోసియేషన్' (హెచ్‌ఎస్‌ఆర్‌ఏ) సభ్యులకు ఆగ్రహం వచ్చింది. ఇది స్వాతంత్ర్య సమరయోధుడు భగవతి చరణ్ ఓహ్రా నడుపుతున్న గ్రూప్. చంద్రశేఖర ఆజాద్, భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ తదితరులంతా ఇందులో సభ్యులు. వీరంతా కలిసి లాఠీచార్జిని ఆర్డర్ వేసిన బ్రిటిష్ ఆఫీసర్ స్కాట్‌ను చంపాలనుకున్నారు. నిర్ణయం అమలు పరచడమే తరువాయి.



స్కాట్ బదులు సాండర్స్

భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ఈ ముగ్గురు 17 డిసెంబర్ 1928న లాహోర్‌లో పోలీస్ ఆఫీసర్ స్కాట్‌ను హతమార్చడానికి సిద్ధమయ్యారు. అయితే బైక్ మీద రావాల్సిన స్కాట్ కారులో, కారులోనూ రావాల్సిన మరో అధికారి సాండర్స్ బైక్ మీద రావడంతో అయోమయం నెలకొంది. అయినా సరే ఎదురుపడిన సాండర్స్‌పై మొదట రాజ్‌గురు, ఆ తర్వాత భగత్ సింగ్ తుపాకీ పేల్చి అతణ్ణి హతమార్చారు. లాహోర్ అంతా గగ్గోలు రేగింది. వందలాది మంది పోలీసులు అన్ని దారులు... బస్టాండ్లు... రైల్వేస్టేషన్లు కమ్ముకున్నారు. లాహోర్‌లో ఉండటం భగత్‌సింగ్‌కు ఏ మాత్రం మంచిది కాదు. అతణ్ణి తప్పించేవారు ఎవరు?

ఆమె వచ్చింది

భగవతి చరణ్ ఓహ్రా సతీమణి దుర్గావతిని అందరూ దుర్గాభాభీ అని పిలిచేవారు. సాండర్స్‌ని హత్య చేశాక భగత్‌సింగ్, రాజ్‌గురు నేరుగా దుర్గావతి దగ్గరకు వచ్చారు. అప్పటికి ఆమె భర్త వేరే పని మీద కలకత్తా వెళ్లి ఉన్నాడు. జరిగింది తెలుసుకున్న దుర్గావతి వెంటనే భగత్‌సింగ్‌ను లాహోర్ దాటించడానికి సిద్ధమైంది. జుట్టు కత్తిరించుకుని హ్యాట్ పెట్టి రూపం మార్చిన భగత్‌సింగ్‌కు ఆమె భార్యగా నటిస్తూ తన మూడేళ్ల కొడుకుతో మరుసటి రోజు సాయంత్రం లాహోర్ నుంచి డెహ్రాడూన్ వెళుతున్న ఎక్స్‌ప్రెస్‌లో మొదటి తరగతి ప్రయాణికురాలిగా బయల్దేరదీసింది. వందలాది నిఘా కళ్ల మీద ఈ పని చేయడం చాలా ప్రమాదం... మూడేళ్ల కొడుక్కు కూడా ఏదైనా కావచ్చు అని భగత్‌సింగ్ ఆమెతో అన్నాడు. 'నా కొడుక్కు మరణం సంభవిస్తే ఒక దేశభక్తునిగా తన ప్రాణం అర్పించే అవకాశం వాడికి దక్కుతుంది' అని చెప్పి ఆమె ముందుకు కదిలింది. భగత్‌సింగ్ ఆధునికవేషంలో ఉన్న అధికారిగా, దుర్గావతి అతని భార్యగా, రాజ్‌గురు నౌకరుగా ఆ ప్రయాణం చేశారు. బ్రిటిష్ వాళ్లకు ఏ మాత్రం అనుమానం రాలేదు. భగత్‌సింగ్‌ను అలా క్షేమంగా కలకత్తా చేర్చి వెనక్కు వచ్చింది దుర్గావతి.

గొప్ప దేశభక్తురాలు

స్వతంత్ర పోరాటం చేస్తున్న భగవతి చరణ్ ఓహ్రాను వివాహం చేసుకునేనాటికి దుర్గావతికి 13 ఏళ్లు. పెళ్లి తర్వాతనే చదువుకుంది. ఇంట్లో ఇరుగు పొరుగు పిల్లలకు పాఠాలు చెప్పేది. సాయుధ పోరాటం చేయాలన్న భర్త ఆశయానికి మద్దతుగా నిలిచిందామె. భగత్‌సింగ్‌ను తన కన్నబిడ్డలా భావించింది. భగత్ సింగ్ పార్లమెంట్‌లో బాంబు దాడి చేసి అరెస్ట్ అయ్యాక ఆ తర్వాతగాని అతడే సాండర్స్ హత్యలో ఉన్నాడన్న సంగతి పోలీసులకు తెలియలేదు. ఆ కేసు వాదనలను బ్రిటిష్ ప్రభుత్వం హడావిడిగా ముగించి అక్టోబర్ 7, 1930న తీర్పు వెలువరించి భగత్‌సింగ్‌కు మరణశిక్ష విధించింది. అయితే లాహోర్‌లో ఈ విచారణ జరుగుతున్నప్పుడు భగత్‌సింగ్‌ను తీసుకెళ్లే వ్యానుపై బాంబుదాడి చేసి అతణ్ణి కాపాడాలని ప్లాన్ చేసింది దుర్గావతి. వీలు కాలేదు.

భర్తను కోల్పోయి

భగత్‌సింగ్‌ను జైలు నుంచి రక్షించడానికి స్వదేశీ జ్ఞానంతో బాంబులు తయారు చేస్తూ ప్రమాదవశాత్తు భగవతి చరణ్ ఓహ్రా మరణించాడు. అంత కష్టాన్ని తట్టుకుని దేశం కోసం పోరాడాలనుకుంది దుర్గావతి. భగత్‌సింగ్ మరణశిక్ష విధించాక ఆగ్రహంతో బొంబాయి వెళ్లి బ్రిటిష్ గవర్నర్‌ను చంపాలనుకుంది. అయితే గవర్నర్ దొరకలేదు. మరో బ్రిటిష్ అధికారి మీద స్వయంగా గుళ్ల వర్షం కురిపించి పగ చల్లార్చుకుంది. భగత్ సింగ్ ఉరి (1931 మార్చి 23) తర్వాత తన వాళ్లంటూ ఎవరూ లేకపోవడం, పోలీసుల వెతుకులాట ఎక్కువ కావడంతో తనే వెళ్లి లొంగిపోయింది. మూడేళ్ల జైలు శిక్ష అనంతరం మొదట లక్నో ఆ తర్వాత ఘజియాబాద్‌లో పెద్దగా పబ్లిక్‌లో ఉండటానికి ఇష్టపడక స్కూల్ నడుపుతూ 1999లో తన 92వ ఏట మరణించిందా గొప్ప దేశభక్తురాలు, భారత తొలి సాయుధ పోరాట సమరయోధురాలు దుర్గాభాభీ.

ఇది సైనికుల సంగ్రామం

- ఇంటికొకరుగా ఆర్మీ జవాన్లు
- నాటి పీపుల్స్‌వార్ ఖిల్లా నుంచి నేడు దేశరక్షణకు సరిహద్దుల్లో యువకులు

ఒక్కో ఊరికి ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. అలా ఈ ఊరికి ఉన్న ప్రత్యేకత 'దేశభక్తి'. దేశాన్ని కాపాడాలనే ధ్యేయంతో ఊరి యువకులు సైన్యం బాట పట్టారు. ఒకే ఊరి నుంచి ఇంటికి ఒక్కరు చొప్పున సుమారుగా 92 మందికిపైగా యువకులు సైన్యంలో తమ సేవలను అందిస్తున్నారు. ఫలితంగా ఒకప్పుడు పీపుల్స్‌వార్ ఖిల్లాగా ఉన్న ఆ ఊరిని ఇప్పుడు ఆర్మీ జవాన్ల పుట్టినిల్లుగా పిలుచుకుంటున్నారు. ఆ ఊరు సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం కట్కూర్ గ్రామం. ఆ ఊరి ముచ్చట్లలోకి వెళదామా?

సుమారు 40 ఏళ్ల క్రితం కట్కూర్ గ్రామానికి చెందిన జేరిపోతుల డేనియల్ మిలిటరీలో జవాన్‌గా చేరాడు. ఆయన స్ఫూర్తితో గ్రామంలోని యువకులు సైన్యం బాటపట్టారు. ఇలా ఒకరిని చూసి మరొకరు ఆర్మీలో చేరారు. జవాన్ స్థాయి నుంచి లాన్స్‌నాయక్, నాయక్, హవల్దార్, నాయక్ సుబేదార్ స్థాయి వరకు వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. ఇలా గ్రామానికి చెందిన వారు ప్రస్తుతం 92 మంది ఆర్మీలో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. దాంతో జిల్లాలో కట్కూరు గ్రామం అంటే ఆర్మీజవాన్‌ల గ్రామంగా గుర్తింపు పొందింది. ఈ గ్రామంలో 1,014 కుటుంబాలుండగా జనాభా సుమారుగా 3,045 ఉన్నారు. అందులో మొత్తం గ్రామంలో 175 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉంటారు. వీరిలో కొందరు ఇతర ఉద్యోగాలు చేస్తుండగా, మరికొందరు గ్రామంలో వ్యవసాయం చేసుకుంటున్నారు.

- మాలోతు శ్రీనివాస్, సాక్షి, అక్కన్నపేట

దేశసేవ ఇష్టం...



దేశసేవ అంటే నాకు చాలా ఇష్టం. అందుకే 1998లో భారతసైన్యంలో చేరాను. మద్రాస్ ఇంజినీరింగ్ గ్రూప్ బెంగళూర్‌లో ట్రెనింగ్ చేశాను. కార్గిల్ యుద్ధంలో కూడా పాల్గొన్నాను. కాశ్మీర్‌లో రాష్ట్రీయ విభాగంలో సేవలు అందించి అనేక టెర్రరిస్ట్ ఆపరేషన్‌లలో పాల్గొన్నాను. కాశ్మీర్ సేవలను గుర్తించి నాకు సుబేదార్ మేజర్‌గా ప్రమోషన్ ఇచ్చారు.

- పంజా సదయ్య, సుబేదార్

గర్వపడుతున్నా...



దేశరక్షణ కోసం సైన్యంలో పని చేస్తున్నందుకు గర్వపడుతున్నాను. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా దేశం కోసం పని చేయడం ఆనందంగా ఉంది.

- కొయ్యడ శ్రీనివాస్, ఆర్మీ జవాన్

మన(సు)లో మాట



మా బాబు వయసు 5 సంవత్సరాలు. ఒకచోట నిలకడగా ఉండకుండా, ఎప్పుడూ అటూ ఇటూ తిరుగుతూ ఉంటాడు. ఇంట్లో, స్కూల్లో బయటా కూడా ఇలాగే చస్తుంటాడు. బయట ఫంక్షన్లకు తీసుకెళితే తనను పట్టుకోవడం, తన చుట్టూ తిరగడంతోటే సరిపోతుంది. అందువల్ల ఈ మధ్య బయటకు వెళ్లడం కూడా తగ్గించేశాం. వాళ్ల నానమ్మేమో, ఇది పిల్లల్లో మామూలే అంటుంది. ఈ మధ్య వాళ్ల స్కూల్ టీచర్ మమ్మల్ని పిలిచి, మా బాబు మీద అనేక కంప్లయింట్లు చెప్పింది. మాకు చాలా ఆందోళనగా ఉంది.

– కె. మాధవి, సికింద్రాబాద్

పిల్లల మెదడులో ఉండే సెల్ఫ్ కంట్రోల్ విభాగం లోని లోపాల వల్ల, వారసత్వ లక్షణాల రీత్యా, కొందరు పిల్లలకు మీరు చెప్పిన లక్షణాలు రావచ్చు. దీనిని హైపర్ యాక్టివిటీ లేదా ఏడీహెచ్‌డీ అంటారు. నిలకడ లేకపోవడం, చదువు మీద ఏకాగ్రత లేకపోవడం, వస్తువులు విసిరేయడం, సహనం లేకపోవడం, ఎప్పుడూ అటూ ఇటూ తిరుగుతూ ఉండటం, స్కూల్‌లో వస్తువులు మరచిపోవడం, ఈ సమస్య ముఖ్య లక్షణాలు. వీరికి తెలివితేటలు బాగానే ఉన్నప్పటికీ, ఏకాగ్రత లోపించడం వల్ల చదువులో వెనకబడతారు. ఇలాంటి వారిని ఎంత చిన్నవయసులో గుర్తించి, సరియైన చికిత్స చేయిస్తే అంత తొందరగా దీంట్లోంచి బయట పడతారు. ఆక్యుపేషనల్ థెరపీ, బిహేవియర్ థెరపీ, అవసరమైతే కొద్ది మోతాదులో కొన్ని మందులు వాడటం ద్వారా వీరిని పూర్తిగా బాగు చెయ్యొచ్చు. పేరెంట్స్, టీచర్లు ఇలాంటి వారిని త్వరగా గుర్తించగలిగితే తొందరగా బాగుపడతారు. మైకేల్ ఫిలిప్స్ అనే స్విమ్మర్ ఈ సమస్యతో బాధపడుతూ చికిత్స తీసుకుని బాగుపడి, ఒలింపిక్స్‌లో 20కి పైగా స్వర్ణ పతకాలు సాధించాడు. చైల్డ్ సైకియాట్రిస్ట్‌ల సూచనలు తీసుకోవడం, పాటించడం మేలు చేస్తుంది.




- డా. ఇండ్ల విశాల్ రెడ్డి
సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com

---

హెల్దీ డైట్

సగ్గుబియ్యం పొంగనాలు



కావలసినవి: సగ్గుబియ్యం – అర కప్పు (గంట సేపు నానబెట్టాలి); పనీర్ తురుము – 75 గ్రాములు; వేరుశనగపప్పుల పొడి– 3 టేబుల్ స్పూన్‌లు; క్యారట్ తురుము – 3 టేబుల్ స్పూన్‌లు ; బంగాళదుంప – 1 (ఉడికించి తొక్క తీసి చిదమాలి); జీలకర్ర పొడి– టీ స్పూన్; ధనియాల పొడి– టీ స్పూన్; మిరప్పొడి– టీ స్పూన్; ఉప్పు– అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; క్యాబేజ్ తరుగు – ముప్పావు కప్పు; క్యాప్సికమ్ ముక్కలు – అర కప్పు (రెడ్, గ్రీన్ క్యాప్సికమ్); చీజ్ తురుము – 50 గ్రాములు (12 భాగాలు చేసుకోవాలి); నూనె – టీ స్పూన్.



డాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ అండ్ వెల్‌నెస్ కోచ్

తయారీ: ● ఒక పాత్రలో క్యాబేజ్ తురుము, క్యాప్సికమ్ ముక్కలు వేసి ఐదు నిమిషాల సేపు పక్కన ఉంచాలి. ఆ తర్వాత ఇందులో నూనె, చీజ్ మినహా మిగిలినవన్నీ వేసి బాగా కలిపి పన్నెండు భాగాలుగా చేయాలి. ఒక్కో భాగంలో చీజ్ స్టఫ్ చేస్తూ గోళీలాగా చేయాలి ● గుంత పొంగనాల పెనం వేడి చేసి ఒక్కో గుంతలో ఒక్కో చుక్క నూనె రుద్ది పొంగనాన్ని పెట్టి మీడియం మంట మీద కాలనివ్వాలి. ఒకవైపు కాలిన తర్వాత రెండోవైపు కాల్చాలి.

పోషకాలు: (ఒక్కో పొంగనంలో)...
● కేలరీలు 63; ● ప్రొటీన్ – 2.5 – 3 గ్రాములు; ● కార్బోహైడ్రేట్లు – 8–9 గ్రాములు; ● ఫ్యాట్ – 2–3 గ్రాములు; ● ఫైబర్– గ్రాము; క్యాల్షియం – 40 –50 గ్రాములు.

పోస్టల్ స్టాంపులు

యుద్ధం ముద్రలు

మహిళలు ఇల్లు విడిచి బయట అడుగు పెడితే వింతగా చూసే కాలంలో సాహసమే వెన్నెముకగా స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు ఎంతోమంది మహిళలు. వారి త్యాగాల వెలుగు చరిత్రకే పరిమితమైనది కాదు, వర్తమానంలోనూ స్ఫూర్తిని ఇస్తుంటుంది. ఎంతోమంది మహిళా స్వాతంత్ర్య సమరయోధుల పోస్టల్ స్టాంప్స్ విడుదల అయ్యాయి. ఈ చిన్న స్టాంప్‌లు వారి త్యాగాలు, పోరాట పటిమను ప్రతిఫలిస్తాయి. పోస్టల్ స్టాంప్స్‌పై మెరిసిన కొందరు మహిళా స్వాతంత్ర్య సమరయోధుల గురించి...



రుక్మిణీ లక్ష్మీపతి

ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోని మధురైలో పుట్టింది రుక్మిణీ. గాంధీజీ 'హరిజన సంక్షేమ నిధి' కోసం తన బంగారు నగలన్నీ విరాళంగా ఇచ్చేసింది. సహాయ నిరాకరణోద్యమం, విదేశీ వస్తు బహిష్కరణోద్యమంలో చురుగ్గా పాల్గొంది. ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించింది. ఉప్పు సత్యాగ్రహం సందర్భంగా అరెస్టయి జైలు శిక్ష అనుభవించిన తొలి మహిళగా చరిత్రలో నిలిచింది.



సుభద్రా జోషి

గాంధీజీ ఉపన్యాసాలతో ప్రభావితం అయిన సుభద్రా జోషి విద్యార్థిగా ఉన్న రోజుల్లోనే క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొంది. 'హమారా సంగ్రామ్' పత్రికకు ఎడిటర్‌గా పని చేసింది. సుభద్రను అరెస్ట్ చేసి లాహోర్ సెంట్రల్ జైల్‌కు తరలించారు. విడుదలయ్యాక మళ్లీ ఉద్యమంలో భాగం అయింది. సుభద్ర అంకితభావాన్ని నెహ్రూ ప్రశంసించారు.



రాణి మా గైడిన్లియు

బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా మొదలైన 'హెరాక' ఉద్యమంలో పదమూడు సంవత్సరాల వయసులోనే పాల్గొంది రాణి మా. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన ఆదివాసి మహిళగా చరిత్రకెక్కింది. 'హెరాక' ఉద్యమంతో పాటు ఎదుగుతూ వచ్చిన రాణి మా ప్రముఖ రాజకీయ నాయకురాలిగా, ఆధ్యాత్మిక గురువుగా ప్రఖ్యాతి పొందింది.



బేగం హజ్రత్ మహల్

తొలి తరం మహిళా స్వాతంత్ర్య సమరయోధురాలు బేగం హజ్రత్ మహల్. బేగం హజ్రత్ ఇతర సంస్థానాధీశులతో కలిసి బ్రిటిష్ వారితో యుద్ధం చేసింది. లక్నో సమీపంలో జరిగిన యుద్ధంలో బ్రిటిష్ వారిని ఓడించింది. ఆ తరువాత కాలంలో మాత్రం ఓటమికి గురైంది. బ్రిటిష్ వారికి చిక్కకుండా అడవుల్లో తల దాచుకొని పోరాడేది.



కమలానెహ్రూ

జవహర్‌లాల్ నెహ్రూ సతీమణి కమలా నెహ్రూ మహిళా సాధికారత కోసం గళం విప్పిన యోధురాలు. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా అరెస్టై జైలుకు వెళ్లింది. 'దేశ సేవిక' సంఘాలను ఏర్పాటు చేసి ఎంతోమంది మహిళలు స్వాతంత్ర్య ఉద్యమంలో భాగం అయ్యేలా చేసింది.



సుభద్రాకుమారి చౌహాన్

సుభద్రాకుమారి చౌహాన్ కవయిత్రి, స్వాతంత్ర్య సమరయోధురాలు. సహాయ నిరాకరణ ఉద్యమంలో చేరిన తరువాత నాగపూర్ నుంచి అరెస్ట్ అయిన మొట్టమొదటి మహిళా సత్యాగ్రహిగా చరిత్రలో నిలిచింది. మహిళలపై వివక్షతకు వ్యతిరేకంగా పోరాడింది. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా ఎన్నో త్యాగాలు చేసింది.

అరుణా అసఫ్ అలి



భర్త అసఫ్ అలీతో పాటు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొంది అరుణ. ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొని అరెస్ట్ అయింది. కాంగ్రెస్‌పార్టీ క్విట్ ఇండియా తీర్మానం చేసిన తరువాత బ్రిటిష్ వారు విరుచుకుపడ్డారు. ప్రముఖ నాయకులను అరెస్ట్ చేశారు. ఆ క్లిష్ట సమయంలో అరుణా అసఫ్ అలి కార్యకర్తలకు అండగా ఉంది. బొంబాయి గొవాలియా ట్యాంక్ మైదానంలో కాంగ్రెస్ జెండాను ఎగరేసి క్విట్ ఇండియా ఉద్యమం ఊపందుకునేలా చేసింది.

దుర్గాబాయి దేశ్‌ముఖ్



దుర్గాబాయి దేశ్‌ముఖ్ సాహసవంతురాలైన సామాజిక కార్యకర్త, చిన్నతనం నుంచే మహిళల హక్కుల కోసం పోరాడింది. మహాత్మా గాంధీ నుంచి స్ఫూర్తి పొంది స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొంది. గాంధీజీ ప్రభావంతో దుర్గాబాయి మాత్రమే కాదు ఆమె కుటుంబం మొత్తం అన్ని రకాల పాశ్చాత్య దుస్తులను విడిచిపెట్టి, ఖాదీని మాత్రమే ధరించేవారు. మద్రాస్‌లో ఉప్పు సత్యాగ్రహ ఉద్యమానికి నాయకత్వం వహించింది.

రాజ్‌కుమారీ అమృత్ కౌర్



రాజ్‌కుమారీ అమృత్ కౌర్ సామాజిక కార్యకర్త, స్వాతంత్ర్య సమరయోధురాలు. గాంధీజీ కార్యదర్శిగా పని చేసిన ఆమె దండి మార్చ్‌లాంటి ఎన్నో జాతీయ ఉద్యమాలలో చురుకుగా పాల్గొంది. క్విట్ ఇండియా ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన రాజ్‌కుమారి ఇరవై నెలల పాటు జైల్లో గడపాల్సి వచ్చింది. రాచరిక కుటుంబంలో పుట్టినప్పటికీ మహాత్ముడి ఆశ్రమంలో సాధారణ జీవితాన్ని గడిపింది.

అరుదైన ఆహ్వానం

12 ఏళ్లు... 15 లైబ్రరీలు

ఈ ఏడాది స్వాతంత్ర్య వేడుకలకు ప్రత్యేక ఆహ్వానం అందుకున్న ఇరవై మందిలో విద్యార్థులు ఆరుగురు. వారిలో అమ్మాయి ఒకే ఒక్కరు. ఆ సరస్వతి పుత్రిక పేరు ఆకర్షణ. లైబ్రరీలు స్థాపిస్తూ సాహిత్యాన్ని సామాన్యులకు దగ్గర చేస్తున్న ఆమె అక్షరసేవకు జాతీయ స్థాయిలో అందిన గుర్తింపు ఇది.


● సికింద్రాబాద్ రాష్ట్రపతి నిలయంలో రాష్ట్రపతితో...

''హైదరాబాద్ హెడ్ పోస్ట్ ఆఫీస్ పోస్ట్‌మాస్టర్ నుంచి 12వ తేదీన నాన్నకు ఫోన్ వచ్చింది. స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా 15వ తేదీన ఢిల్లీలో జరిగే వేడుకలకు హాజరు కావలసిందిగా మీ అమ్మాయి ఆకర్షణకు ఆహ్వానం వచ్చిందని చెబుతూ అభినందనలు తెలియచేశారు'' అంటూ తాను లైబ్రరీ వ్యవస్థాపకురాలిగా మారిన వివరాలను సాక్షి ఫ్యామిలీతో పంచుకున్నారు ఆకర్షణ సతీష్.

కోవిడ్ వచ్చినప్పుడు

''హైదరాబాద్‌లో స్థిరపడిన తమిళ కుటుంబం మాది. నాన్న సతీశ్ క్యాన్సర్ ఎక్విప్‌మెంట్ తయారీ కంపెనీ ఉద్యోగి. నేను హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఎనిమిదవ తరగతి చదువుతున్నాను. పుస్తక పఠనం నా హాబీ కావడంతో వెయ్యికి పైగా పుస్తకాలతో ఇంట్లోనే నాకు సొంత లైబ్రరీ ఉంది. ఇతరుల కోసం లైబ్రరీ స్థాపించాలనే ఆలోచన కోవిడ్ సమయంలో వచ్చింది.

తొలి లైబ్రరీ క్యాన్సర్ హాస్పిటల్‌లో

నాన్న ఉద్యోగరీత్యా క్యాన్సర్ హాస్పిటళ్లకు టచ్‌లో ఉంటారు. కోవిడ్ సమయంలో ఎమ్ఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్ వాళ్లు 'కోవిడ్ కారణంగా వంటవాళ్లు డ్యూటీకి రావడం లేదు. పేషెంట్‌లకు ఆహారం అందించడానికి ప్రత్యామ్నాయ ప్రయత్నాలు చేసి పెట్టవలసింది'గా కోరడంతో నాన్న వాళ్ల కోసం రోజూ భోజనం వండించి తీసుకెళ్లి ఇచ్చేవారు. నాకు స్కూల్ లేకపోవడంతో రోజూ నాన్నతోపాటు హాస్పిటల్‌కి వెళ్లేదాన్ని. అక్కడ ట్రీట్‌మెంట్ తీసుకుంటున్న పేషెంట్‌లలో నా ఏజ్ గ్రూప్ వాళ్లతో స్నేహం ఏర్పడింది. వాళ్లు కొంతమంది చదువుకోవడానికి పుస్తకాలు తెచ్చిపెట్టమని అడిగారు. రోజూ నా పుస్తకాలు కొన్ని తీసుకెళ్లి ఇస్తూ ఉన్నప్పుడు హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ జయలత గారు... 'హాస్పిటల్‌కి చికిత్స కోసం ఎప్పుడూ కొత్తవాళ్లు వస్తుంటారు. హాస్పిటల్‌లోనే లైబ్రరీ ఉంటే బావుంటుంది' అన్నారు. వారి ఆలోచనే నా లైబ్రరీ ఉద్యమానికి నాంది. నా పుస్తకాలతోపాటు మా స్కూల్, అపార్ట్‌మెంట్ స్నేహితుల నుంచి సేకరించిన వెయ్యికి పైగా పుస్తకాలతో తొలి లైబ్రరీ అలా మొదలైంది. ఇప్పటికి 9,836 పుస్తకాలతో 15 లైబ్రరీలు ఏర్పాటు చేయగలిగాను.

పదకొండు వేల పుస్తకాలు

నాలుగేళ్లలో పదకొండు వేల పుస్తకాలు సేకరించాను. అందులో రెండు వేల పుస్తకాలు ప్రధాని నరేంద్రమోదీగారిచ్చారు. ఈ ఏడాది మార్చి 18న కోయంబత్తూరులో ఆయనను కలిసే అవకాశం వచ్చింది. ఆ సందర్భంగా ఆయన 25 లైబ్రరీలు స్థాపించమని, 25 లైబ్రరీ స్థాపనకు స్వయంగా హాజరవుతానని చెప్పారు. భారత రాష్ట్రపతి గత ఏడాది శీతాకాల విడిది కోసం హైదరాబాద్‌కి వచ్చినప్పుడు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో కలిశాను. అప్పుడామె 'ప్రజల్లో రీడింగ్ హ్యాబిట్ తగ్గుతోంది, పుస్తక పఠనాన్ని ప్రోత్సహించడానికి దోహదం చేస్తున్న ఈ ప్రయత్నాన్ని కొనసాగించ'మని చెప్పి ఆమే స్వయంగా 74 పుస్తకాలిచ్చారు. ఈ ఏడాది ఢిల్లీ, కర్తవ్య పథ్‌లో జరిగిన 75వ రిపబ్లిక్ డే ఉత్సవాలకు ప్రభుత్వ ప్రత్యేక ఆహ్వానం మేరకు హాజరయ్యాను. ఇదే ఏడాది స్వాతంత్ర్యదినోత్సవం వేడుకలకు కూడా హాజరయ్యే అవకాశం కలగడం సంతోషంగా ఉంది'' అంటూ 25 లైబ్రరీల లక్ష్యాన్ని పూర్తి చేస్తానని చెప్పింది ఆకర్షణ సతీశ్.

- వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి